క్లుప్తంగా

ట్రిపుల్ ఐటీకి ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రాజు

ఆళ్లగడ్డ: మండలంలోని కోటకందుకూరు గ్రామం ఏపీ మోడల్ స్కూల్‌ల చదివిన ముగ్గురు విద్యార్థులకు ట్రిపుల్‌ఐటీలో సీటు వచ్చినట్లు ప్రిన్సిపాల్ రాజు తెలిపారు. సాయి లక్ష్మి భార్గవికి శ్రీకాకుళం, నందిని ఇడుపుల పాయ, షాజిదకు ఒంగోలు సీటు వచ్చినట్లు తెలిపారు. వీరు 2024–2025 విద్యాసంవత్సరం పదవ తరగతి ఫలితాల్లో మంచి మార్కులు సాధించినందుకు ఎంపికై నట్లు చెప్పారు. బుధవారం స్థానిక మోడల్ స్కూల్లో ఆ విద్యార్థులను ప్రిన్సిపాల్‌అభినందించారు.

పాదచారులకు అన్నవితరణ



అన్నదానం నిర్వహిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): వాసవీ జాగ్రృతి ఇంటర్నేషనల్ క్లబ్ ఆధ్వర్యంలో గుప్పెడంత బియ్యం కార్యక్రమాన్ని పురస్కరించుకొని బుధవారం గాంధీచౌక్‌లో పాదచారులకు అన్నవితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు శ్రీనివాస్ దత్తాత్రేయ, క్లబ్ గవర్నర్ బింగుమల్ల శ్యాంసుందర్‌గుప్త మాట్లాడుతూ ప్రతి నెల అమవాస్య రోజున క్లబ్ సభ్యుల సహకారంతో తమ శక్తి మేరకు బియ్యాన్ని అందివ్వడంతో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు నాగరాజు, పుష్పలత, తేజ, జనార్దన్, శివశంకర్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

పొగాకు కంపెనీలపై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రంగనాయుడు

నంద్యాల(న్యూటౌన్): రైతుల నుంచి అగ్రిమెంట్ చేసుకొని పొగాకు కొనుగోలు చేయని కంపెనీలపై చర్యలు తీసుకోవాలని ఏపీ రైతు సంఘం జిలా ప్రధాన కార్యదర్శి సోమన్న, సీపీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రంగనాయుడు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ అగ్రిమెంట్ కుదుర్చుకున్న జీపీఐ, అలయన్స్ కంపెనీలు పొగాకు కొనుగోలు చేయకపోవడంతో మిడుతూరు మండలం చౌట్కూరు గ్రామానికి చెందిన రైతు మంగళి రామకృష్ణ ఆత్మహత్యాయత్నం చేసుకున్నాడన్నారు. దీనికి కారణమైన కంపెనీలపై చర్యలు తీసుకోవడంతో పాటు రైతుల నుంచి పొగాకు కొనుగోలు చేపట్టేలా చూడాలని అధికారులను కోరారు.

అడవి పందులతో పైర్లకు నష్టం

మహానంది: అడవి పందులతో పైర్లకు నష్టం కలుగుతోందని బసవాపురం గ్రామానికి చెందిన రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు సుబ్బరాయుడు, మద్దిలేటి తదితరులు సుమారు మూడున్నర ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. మంగళవారం రాత్రి అడవి పందులు పొలాల్లోకి ప్రవేశించి నాశనం చేశాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అడవి పందుల బారి నుంచి పైర్లను కాపాడేందుకు అటవీశాఖ అధికారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

ఆలయ భూములకు బహిరంగ వేలం

బండి ఆత్మకూరు: మండల పరిధిలోని పెద్దదేవలాపురం గ్రామానికి చెందిన ఆలయ భూములకు బుధవారం కౌలుకు బహిరంగ వేలం నిర్వహించామని గ్రూపు దేవస్థానముల కార్యనిర్వహణ అధికారి ఈ.నాగప్రసాద్ బుధవారం తెలిపారు. వరదరాజ, లింగమయ్య స్వామి, ఆంజనేయస్వామి ఆలయాలకు చెందిన 40.36 ఎకరాల భూమికి కౌలుకు బహిరంగ వేలం నిర్వహించగా రూ.12.83 లక్షలు ఆదాయం వచ్చిందన్నారు. కాగా గత ఏడాది ఇదే భూములకు రూ.17.29 లక్షలు వచ్చిందన్నారు. కార్యక్రమానికి కోవెలకుంట్ల గ్రూపు దేవస్థానం ఈఓ టి.బాల చెంచన్న పాల్గొన్నారు.

ముందస్తు ప్రసవాలు ప్రమాదకరం

కర్నూలు(హాస్పిటల్): జాతకాల పిచ్చి, మూఢ నమ్మకాలతో ముందస్తు ప్రసవాలు చేయించుకోవడం ప్రమాదకరమని జిల్లా సంచార చికిత్స కార్యక్రమం నోడల్ అధికారి డాక్టర్ రఘు చెప్పారు. బుధవారం నగరంలోని అంబేడ్కర్ నగర్ ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో నిర్వహించిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. స్త్రీకి మాతృత్వం దేవుడిచ్చిన వరమన్నారు. సాధారణ ప్రసవం తల్లీ బిడ్డ ఆరోగ్యానికి మంచిదన్నారు. ప్రస్తుతం ఆధునిక పోకడలతో కొంత మంది మూఢనమ్మకాలు, జాతకాల పేరిట ముహూర్తం చూసి ముందస్తు ప్రసవాలకు మొగ్గు చూపుతున్నారని అన్నారు. తల్లీ బిడ్డ ఆరోగ్యానికి ప్రమాదమని తెలిసినా ఆపరేషన్లు చేయించుకుంటున్నారని చెప్పారు. తల్లి కడుపులో నవమాసాలు ఉండి సరైన ఎదుగుదలతో భూ ప్రపంచంలో అడుగుపెట్టాల్సిన శిశువులు అరకొర ఆరోగ్యంతోనే బయటకు వస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అంతిమంగా అటు తల్లికి, ఇటు శిశువుకు అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని తెలిపారు.

వేడుకలకు ముస్తాబు

- నేటి నుంచి ఆషాఢ మాసం ప్రారంభం
- నెలరోజుల పాటు పూజలందుకోనున్న జగజ్జననీ, శ్రీకాళికాంబ



శ్రీజగజ్జననీ అమ్మవారు



ఆషాఢం వేడుకలకు జగజ్జననీ ఆలయంలో ఏర్పాట్లు (ఇన్‌సెట్) శ్రీకాళికాంబాదేవి



నంద్యాల(వ్యవసాయం): ప్రపంచంలోనే రెండో ఆలయంగా ప్రసిద్ధి గాంచిన శ్రీ జగజ్జననీ దేవి, అతిపురాతన ఆలయమైన శ్రీ కాళికాంబ దేవస్థానం వేడుకలకు ముస్తాబయ్యాయి. నేటి నుంచి ఆషాఢమాసం ప్రారంభమవుతుండటంతో నెలరోజుల పాటు ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగనున్నాయి. ఉమ్మడి ఏపీలోని పలువురు భక్తులు శ్రీజగజ్జననీ దేవి, కాళికాంబా దేవిలను తమ ఇంటి ఆడబిడ్డగా భావించి ఇంటి నుంచిమేళతాళాలతో సారెను తీసుకొచ్చి సమర్పిస్తారు. జూలై 24వరకు జరిగే ఈ ఉత్సవాల్లో అమ్మవారి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించి పూజలు చేస్తారు. మూల విరాట్‌ను సందర్శించిన అనంతరం ఉత్సవ మూర్తికి సారె సమర్పిస్తారు. నేటి నుంచి వేడుకలు ప్రారంభమవుతుండటంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయా దేవస్థానాల అధికారులు తెలిపారు.

మునిసిపల్ కార్మికులు ఆందోళన బాట

నంద్యాల(న్యూటౌన్): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నంద్యాల మున్సిపాలిటీలో పని చేస్తున్న ఇంజనీరింగ్ కార్మికులు బుధవారం రిలే నిరాహార దీక్ష చేపట్టారు. మున్సిపల్ కార్యాలయం ఎదుట చేపట్టిన ఈ దీక్షలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షుడు దుర్గా మాట్లాడుతూ జీవో నం.36 ప్రకారం కార్మికుడికి రూ.26 వేలు వేతనం ఇవ్వాలని, చనిపోయిన కార్మికుడి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, ఆప్కాస్ రద్దు చేస్తే పర్మినెంట్ చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, తల్లికి వందనంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. 15 ఏళ్లు పైబడిన కార్మికులను క్రమబద్ధీకరించాలన్నారు. ఇంజినీరింగ్ విభాగంలో వాటర్ బోర్డు ఏర్పాటు చేయాలని, స్వయం ప్రతిపత్తి కల్పించాలని, ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా పదవీ విమరణ వయస్సు 60 నుంచి 62 సంవత్సరాలు పెంచాలని డిమాండ్ చేశారు. వీటిపై స్పందించకపోతే ఆందోళన కార్యక్రమాలు మరింత తీవ్రతరం చేస్తామన్నారు.

సమస్యలు పరిష్కరించాకే బదిలీలు చేయాలి



చాగలమర్రి ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌కు వినతి పత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు

చాగలమర్రి: తమ సమస్యలు పరిష్కరించాకే ప్రభుత్వం బదిలీలు చేపట్టాలని గ్రామ సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు. మండలంలోని అన్ని సచివాలయాల ఉద్యోగులు బుధవారం ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గ్రామ/వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న అన్నీ శాఖల ఉద్యోగులకు ప్రమోషన్ కల్పించి, స్పష్టమైన జాబ్ చార్ట్ ఇవ్వాలన్నారు. తర్వాత బదిలీల ప్రక్రియను సీనియార్టీ ప్రకారం చేయాలన్నారు. నోషనల్ ఇంక్రిమెంట్, పెండింగ్ అరియర్స్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. అలాగే స్వంత మండలాల్లో పనిచేసుకునేందుకు అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు రాజేష్, వెంకట్, క్రిష్ణారెడ్డి, మనోజ్, ప్రసన్న, కిరణ్, రాజశేఖర్, ఫారూఖ్, రాజశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి చౌక దుకాణానికి ప్రత్యేక అధికారి



ఉయ్యాలవాడలో డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉయ్యాలవాడ: మండలంలోని ప్రతి చౌక దుకాణానికి పరిశీలన నిమిత్తం ఒక ప్రత్యేక అధికారిని నియమించినట్లు తహసీల్దార్ సువర్ణాదేవి తెలిపారు. బుధవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చౌక దుకాణ డీలర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రతి నెల నిత్యావసర సరుకులు 65 ఏళ్లు దాటిన వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకు వెళ్లి పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ మధ్యలో ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. రేషన్ కార్డుదారులకు ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు సరుకులు అందజేయాలన్నారు. చౌక దుకాణ డీలర్లు తప్పనిసరిగా నేమ్ బోర్డు కలిగి ఉండి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు దుకాణాలు తెరవాలన్నారు. రేషన్ కార్డుదారుల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తప్పవని డీలర్లను హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌బాబు, ఆర్ఐ అంకన్న, ఏఎస్ఓ ఈశ్వరరావు, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

బ్యాంక్‌కు వెళ్లొచ్చేలోపు ఇంట్లో చోరీ

మహానంది: ఉపాధి కూలీ వేతనాలు ఖాతలో జమ అయ్యాయో లేదో చూసుకుందామని బ్యాంకుకు వెళ్లొచ్చే లోపే బుధవారం తమ్మడపల్లె గ్రామంలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. బాధితుడు కాసుల పెద్ద వెంకటరమణ దంపతులు తెలిపిన వివరాలు.. పెద్ద వెంకటరమణ దంపతులు ఉపాధి కూలీ పనులతో పాటు వ్యవసాయ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఉపాధి కూలీ డబ్బులు ఖాతాలో వేశారేమోనని బుక్కాపురం బ్యాంకుకు వెళ్లాడు. తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా దుస్తులను చెల్లాచెదురు చేసి, రూ.16 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు వాపోయారు. ఈ విషయంపై మహానంది పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

బరకాల కాలనీలో..

బండ ఆత్మకూరు: మండల పరిధిలోని నారాయణపురం బరకల కాలనీలో చోరీ జరిగింది. బుధవారం ఎస్ఐ జగన్మోహన్ తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన కందుకూరి లీలావతి తమ పిల్లలను హాస్టల్‌లో చేర్పించడానికి ఈనెల 22న గిద్దలూరు వెళ్లింది. తిరిగి వచ్చేలోపే ఇంటి తలలు పగలగొట్టి బీరువాలో ఉన్న 4.0 తులాల బంగారం నగలు కనిపించకపోవడంతో చోరీ జరిగిందని నిర్ధారించుకుని పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నేరేడు పండు..పోషకాలు మెండు



నోరూరించే నేరేడు పండ్ల సీజన్ వచ్చేసింది. జూన్, జూలై నెలల్లో మాత్రమే ఈ పండ్లు లభిస్తాయి. కాస్త వగరు, పులుపు, తీపి కలబోతగా ఉండే వీటిలో పోషకాలు పుష్కలం. రక్తాన్ని శుద్ధిచేయడంతో పాటు బీపీ, షుగర్, గుండె, కాలేయ సంబంధిత వ్యాధులు, సీజనల్ రోగాల నియంత్రణకు ఈపండ్లు ఎంతో దోహదపడతాయని వైద్యులు చెబుతున్నారు. దీంతో దీనిని ఇష్టపడని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. ప్రస్తుతం నంద్యాల జిల్లాలో ఈపండ్ల విక్రయాలు జోరందుకున్నాయి. ఉభయ గోదావరి జిల్లాలతో పాటు మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు ఇక్కడికి తీసుకొచ్చి పండ్ల సైజ్‌ను బట్టి కిలో రూ. 100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు. –గోస్పాడు

ఎస్ఐ బదిలీ

ఉయ్యాలవాడ : స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు కర్నూలు సీఐడీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు. ఉయ్యాలవాడ ఎస్ఐగా గత ఏడాది అక్టోబర్ 24వ తేదీన బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్లు 8 నెలల పాటు ఇక్కడ విధులు నిర్వహించారు.

రేపు మండల మీట్

ఉయ్యాలవాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 27వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలాధ్యక్షురాలు బుడ్డా భాగ్యమ్మ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సమావేశానికి వివిధ మండల శాఖ అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని సూచించారు.

డీఎస్సీ పరీక్షల హాల్ టికెట్లు విడుదల

నంద్యాల(న్యూటౌన్): అంతర్జాతీయ యోగా దినోత్సవం నేపథ్యంలో ఈనెల 20, 21 తేదీల్లో జరగాల్సిన డీఎస్సీ– 2025 పరీక్షలను జూలై 1, 2 తేదీలకు ప్రభుత్వం మార్పు చేసింది. ఆయా తేదీల్లో పరీక్ష రాయాల్సిన అభ్యర్థులకు సంబంధించి మార్పు చేసిన పరీక్ష కేంద్రాలు, పరీక్ష తేదీల హాల్‌టికెట్లు మెగా డీఎస్సీ httpr://apdrc.apcfrr.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. అభ్యర్థులు తమ కొత్త హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకొని ఒకటికి రెండుసార్లు పరీక్ష కేంద్రాలు సరి చూసుకొని నిర్ధారించుకోవాలన్నారు.

కొండచరియను ఢీకొన్న కారు

మహానంది: నంద్యాల–గిద్దలూరు నల్లమల ఘాట్ రోడ్డులో ఓ కారు కొండచరియను ఢీకొంది. అనంతపురం జిల్లాకు చెందిన కొందరు గిద్దలూరు మీదుగా శ్రీశైలం వెళ్తుండగా పురాతన వంతెన వద్ద ఉన్న మలుపు సమీపంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి కారు కొండ చరియను ఢీకొంది. డ్రైవర్ చాకచక్యంతో ఎవరికి ఎలాంటి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ప్రజలను వంచిస్తున్న బీజేపీ



సమావేశంలో మాట్లాడుతున్న రమేష్‌కుమార్

నంద్యాల(న్యూటౌన్): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలను మాయమాటలతో వంచిస్తుందని సీపీఎం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్‌కుమార్ అన్నారు. బీజేపీ పాలనకు చరమగీతం పాడేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడని బీజేపీ నేడు బుక్స్‌ను విడుదల చేసి ప్రజలకు తప్పుడు సంకేతాలు పంపుతుందని మండిపడ్డారు. మోదీ సర్కారు పెట్టుబడిదారులకు, కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో సీపీఎం కార్యవర్గ సభ్యులు నాగరాజు, లక్ష్మణ్, తోటమద్దులు, పుల్లా నరసింహ, మహమ్మద్‌గౌస్, వెంకటలింగం, సుబ్బారావు, వీరసేన, తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై పోలీసులకు అవగాహన

కర్నూలు: అత్యవసర పరిస్థితుల్లో ముందుండే పోలీసు సిబ్బందికి సీపీఆర్, ప్రథమ చికిత్సపై జిల్లా పోలీసు కార్యాలయంలో వైద్యులచే శిక్షణ (అవగాహన కార్యక్రమం) నిర్వహించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలోని వ్యాస్ ఆడిటోరియంలో బుధవారం ఎస్పీ విక్రాంత్ పాటిల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. గుండెపోటు వచ్చినప్పుడు, స్పృహ కోల్పోయినప్పుడు ఆసుపత్రికి తీసుకెళ్లే గంటలోపు చేసే సీపీఆర్ విధానాన్ని పోలీసుల చేత ప్రాక్టీస్ చేయించారు. మెడికవర్ ఆసుపత్రి డాక్టర్ సునీల్‌యాదవ్ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరిగింది. ప్రతిభ కనపరచిన వారికి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు లేదా గుండెపోటు వచ్చినప్పుడు కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సీపీఆర్) ద్వారా ప్రాణాలను కాపాడవచ్చన్నారు. రూ.8 వేలు విలువ గల హెల్త్ చెకప్ కూపన్లను పోలీసులకు రూ.వెయ్యికి అందజేశారు. హోంగార్డ్స్ సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్‌కుమార్, ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, పోలీస్ వెల్ఫేర్ హాస్పిటల్ డాక్టర్ స్రవంతి, డీఎస్పీలు బాబుప్రసాద్, భాస్కర్ రావు, ప్రసాద్, సీఐలు, ఆర్ఐలు నారాయణ, జావేద్, సోమశేఖర్ నాయక్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీ ఆదాయం పెంచాలి

- అధికారులతో జిల్లా కలెక్టర్ రాజకుమారి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల: జిల్లాలో జీఎస్టీ ఆదాయాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి సంబంధిత శాఖ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో కమర్షియల్ ట్యాక్స్ శాఖ ఆధ్వర్యంలో జిల్లాలో జీఎస్టీ ఆదాయం పెంపుపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్థిక వనరులను అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో సుమారుగా 12,033 మంది పన్ను చెల్లింపుదారులు ఉన్నారన్నారు. జిల్లాలో ఏదైనా నూతన సంస్థ ఏర్పాటు చేస్తుంటే అందుకు తగిన సమాచారం అందజేయాలన్నారు. అలాగే జిల్లాలో ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయని అందులో ఉన్న సిబ్బంది ప్రొఫెషనల్ టాక్స్‌లోకి వచ్చారా లేదా అనేది చూడాలన్నారు. ముఖ్యంగా వస్తువుల(గూడ్స్)కు సంబంధించి రూ.40 లక్షలు, కాంట్రాక్ట్ సర్వీసులకు సంబంధించి రూ.20 లక్షలు దాటిన వారి వివరాలు తెలపాలన్నారు. జిల్లాలో మైనింగ్ లీజు దారుల నుంచి జీఎస్టీ పన్ను వసూలయ్యేలా చూడాలన్నారు. ప్రతి నెల 10వ తేదిలోపు జీఎస్టీ 7ఆర్‌ను ఫైల్ చేయాలని, లేకపోతే ప్రతి రోజు రూ.100 చొప్పున సంబంధిత డీడీఓ నుంచి వసూలు చేయడం జరుగుతోందన్నారు. అంతకుముందు వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ ఎం.సుధాకర్ రావు, డిప్యూటీ కమిషనర్ పి.సురేష్‌లు వాణిజ్య పన్నుల శాఖ విధి, విధానాలు, జీఎస్టీ నిర్వహణ, జీఎస్టీ ట్యాక్సేషన్ తదితర అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్, నంద్యాల వాణిజ్య పన్నుల శాఖ 1, 2 సహాయ కమిషనర్లు లక్ష్మీనాయక్, సుజిత, ఆర్డీఓలు విశ్వనాథ్, నరసింహులు, అరుణజ్యోతి, జిల్లా ఖజానా అధికారి లక్ష్మీదేవి, మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌డీఎంలు పాల్గొన్నారు.

డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలి

జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా మార్చాలని, ఇందుకు అధికారులు, పోలీసు శాఖ సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణాతో కలిసి మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవ కార్యక్రమ నిర్వహణపై అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈనెల 26న ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని నంద్యాల పట్టణంలో ప్రజలందరిలో చైతన్యం తీసుకువచ్చేలా అవగాహన ర్యాలీ నిర్వహించాలన్నారు. స్థానిక ఎస్పీజీ గ్రౌండ్ నుంచి సంజీవనగర్ గేటు వరకు వెళ్లి తిరిగి ఎస్పీజీ గ్రౌండ్ వద్దకు ర్యాలీ చేరుకునేలా ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. ర్యాలీ అనంతరం పాల్గొన్న వారందరితో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించాలన్నారు. జిల్లాలోని డివిజన్, మున్సిపాలిటీలలో కూడా అవగాహన ర్యాలీ నిర్వహించాలని సూచించారు.

లింగాకర్షక బుట్టలతో కత్తెర పురుగుకు చెక్



మాట్లాడుతున్న ఉపసంచాలకులు చెన్నయ్య

నంద్యాల(అర్బన్): ప్రస్తుతం సాగు చేస్తున్న మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశిస్తే నివారణ చర్యల్లో భాగంగా లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ ఉప సంచాలకులు చెన్నయ్య తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని అయ్యలూరు, పెద్దకొట్టాల గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కత్తెర పురుగు ఆశించిన మొదటి దశలో లీటరు నీటికి 5ఎంఎల్ వేపనూనె పిచికారీ చేయాలన్నారు. అలాగే ఎకరాకు ఆరు లింగాకర్షక బుట్టలు ఏర్పాటుతో పాటు అక్కడక్కడ పక్షి స్థావరాలు ఉండేలా చూడాలన్నారు. ఏవో ప్రసాదరావు మాట్లాడుతూ రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటిస్తూ పంటల సాగు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి శ్రీనివాసరెడ్డి, వీఆర్‌ఓ సురేంద్ర, ఏఈఓ శ్రీధర్, షర్మిల, మాధురి, తదితరులు పాల్గొన్నారు.

చాగలమర్రి: నేల సారవంతానికి పశువుల ఎరువు లేదా పచ్చి రొట్ట ఎరువులను వాడాలని చాగలమర్రి ఏఓ రంగనేతాజి అన్నారు. బుధవారం మండలంలోని పెద్దవంగలి, చిన్నవంగలి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులను సమావేశ పరచి నేల సారవంతానికి సేంద్రియ కర్బనం ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు. మొక్కజొన్న, మినుము పంటలలో సమగ్ర కలుపు యాజమాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో బదిలీలు

రుద్రవరం: మండల పరిధిలోని తువ్వపల్లె తిప్ప మీదున్న ఏపీ మోడల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు, పీడీ శ్రీనివాసులు మినహా మిగిలిన ఉపాధ్యాయులు, ఇతర సిబ్బంది మొత్తం కలిపి 16 మంది బదిలీ అయ్యారు.వీరి స్థానంలో తిరిగి కొత్తగా 15 మంది వచ్చి చేరినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. బుధవారం బదిలీ అయిన వారిని సత్కరించి, కొత్తగా వచ్చిన వారికి స్వాగతం పలుకుతూ పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు.

క్రీడల అభివృద్ధికి కృషి



మధుమంత్‌ను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): జిల్లాలో క్రీడల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు క్రీడా భారతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, జాతీయ స్థాయి సంయుక్త కార్యదర్శి మధుమంత్ అన్నారు. బుధవారం పట్టణంలోని రామకృష్ణ విద్యాసంస్థలో జిల్లా స్థాయి క్రీడా భారతి ఆత్మీయ సభ నిర్వహించారు. ఈకార్యక్రమంలో వారు మాట్లాడుతూ జిల్లాలో క్రీడా భారతి ఆధ్వర్యంలో పది క్రీడా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే విద్యార్థులు, యువకులను క్రీడలపై ఆసక్తి పెంచేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరు క్రీడలను ఎంచుకోవాలన్నారు. అనంతరం మధుమంత్‌ను సన్మానించారు.ఈ కార్యక్రమంలో నంద్యాల జిల్లా అధ్యక్షుడు సుధాకర్, ఉపాధ్యక్షుడు హేమంత్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయరెడ్డి, క్రీడా భారతి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సురేంద్రారెడ్డి, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఎమర్జెన్సీ రోజులు మరచిపోలేనివి



దేశభక్తి నాయకుల కుటుంబాలను సన్మానిస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీ హయాంలో ప్రకటించిన ఎమర్జెన్సీతో ప్రజలు పడిన ఇబ్బందులు మరచిపోలేనివని రాష్ట్ర బీజేపీ సీనియర్ నాయకులు నర్సింగరావు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అభిరుచి మధు పేర్కొన్నారు. బుధవారం జయంతి వెజ్ వరల్డ్‌లో దేశభక్తి నాయకుల కుటుంబాలను సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 1975 జూన్ 25న ఎమర్జెన్సీ ప్రకటించి 20 నెలల పాటు దేశానికి చీకటి రోజులు చూపించిందన్నారు. స్వాతంత్ర భావాజాలం కలిగిన నాయకులను జైలులో వేశారన్నారు. నిరంకుశ పాలన సాగించిన దినాన్ని బీజేపీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం హత్యగావించిన దినంగా ప్రకటించిందన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మేడా మురళీధర్, బాలముని, చిలుకూరి శ్రీనివాస్, రమేష్, కొట్టె చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



అప్పనపల్లె దారిలో వరి నారు

వరి సాగుకు సన్నద్ధం

రుద్రవరం: వరి రైతులు మరోసారి తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు.గతేడాది ధర లేక నష్టపోయారు. ఈసారి దాని నుంచి బయటపడేందుకు మండలంలో పలువురు రైతులు మళ్లీ వరి సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే కొండమాయపల్లె, అప్పనపల్లె, డి.కొట్టాల, నర్సాపురం, ఆలమూరు,చిత్రేనిపల్లె, ముకుందాపురం, చందలూరు, మందలూరు తదితర గ్రామాలకు చెందిన రైతులు బోర్ల కింద నారు మడులు వేశారు. గతేడాది 5 వేల హెక్టార్లలో వరిసాగు చేశారు. ఈ సారి కూడా దాదాపు అదేస్థాయిలో సాగు కావొచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.